
కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్

చంపాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డినగర్‌కాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీ, సూర్యానగర్‌కాలనీ, పద్మానగర్‌కాలనీ, న్యూపద్మానగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీల్లో ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనుల్లో లెవల్స్ సరిగా లేకపోవడం అధికారుల అవగాహన లోపం కనిపిస్తుందన్నారు. కాలనీవాసులకు సివరేజ్, కేబుల్స్, తాగునీటి పైపులైన్స్ నాలా మధ్యలో లేకుండా చూడాలని అన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణాల పక్కన లేవల్‌గా రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు అమరేందర్, కాళిదాసు, రాజవర్ధన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, భూపతిరెడ్డి, వర్మ, మహేష్, జయవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ మరమ్మతు పనుల పరిశీలన


మ్యాన్ హోల్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం ఆయన మోహన్ ప్రధాన రహదారిలో జరుగుతున్న డ్రైనేజీ మ్యాన్ హోల్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఇటీవలే మోహన్‌నగర్ దారిలో పాత మ్యాన్‌హోల్ కూలడంతో అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని బస్తీల్లో, కాలనీల్లో తలెత్తిన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. కాలనీల్లో డ్రైన్ సమ్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు అరీఫ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహానికి పూల అలంకరణ చేయాలి

- జోనల్ కమిషనర్‌కు వినతి

హయత్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 11న జరగనున్న జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే జంట విగ్రహాలకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పూల అలంకరణ చేయాలని కోరుతూ విగ్రహ ఆవిష్కరణ కమిటీ చైర్మన్ ఎర్ర రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పారంద స్వామిలు గురువారం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం సమయం సరిపోలేదని అధికారులు పూల అలంకరణ చేయకుండా వదిలి వేశారని గుర్తు చేశారు. ఈ సంవత్సర అలా జరగకుండా ముందు జాగ్రత్తగా అధికారులు గుర్తుంచుకుని పూల అలంకరణ చేయాలన్నారు. హయత్‌నగర్‌లోని పూలే జయంతి కార్యక్రమానికి పెద్ద ఎత్తున దళిత, బహుజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు.


రైతు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం చైర్మన్ భరత్‌కుమార్

రైతు సంక్షేమం కోసం కృషి: భరత్‌కుమార్

- మృతిచెందిన రైతు కుటుంబానికి సహకార సంఘం 'ఆసరా'

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ స్పష్టం చేశారు. సంఘంలో సభ్యుడైన తారామతిపేటకు చెందిన ఎం. మల్లయ్య ఇటీవల మృతిచెందాడు. దీంతో మృతి చెందిన రైతు కుటుంబానికి సంఘం ద్వారా పంపిణీ చేసే రూ. 25వేలను రైతు భార్య అంజమ్మకు గురువారం సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కోసమే సహకార సంఘం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, చేగూరి మల్లేష్, కైతపాక యాదయ్య, మూల బాల్‌రాజ్, ఎం. బాల్‌రాజ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 3600 ఓట్లకుగాను 2271 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి కొండల్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, జిల్లా రమేష్, రాజేశ్వర్‌రావు పోటీ చేయగా ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ పదవులకు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గసభ్యుల పదవులకు పలువురు పోటీ పడ్డారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ఎన్నికల అధికారులుగా గుర్రం సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ వ్యవహరించారు.

డాక్టరేట్ అందుకున్న మేఘనారెడ్డి



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ మేఘనారెడ్డి

చంపాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న అలూరి మల్లారెడ్డి, లక్ష్మీ దంపతుల కూతురు డాక్టర్ ఏ.మేఘనారెడ్డి గురువారం డాక్టరేట్ పొందారు. మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జన్ పూర్తి చేయడంతో కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బి.భాస్కర్‌రావు చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఆమె స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని మారుమూల గ్రామం చిన్న రేవల్లి. ఆమె తండ్రి మల్లారెడ్డి పాల వ్యాపారం చేస్తూ కూతురుతో పాటు కుమారులు మనిష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలను చదివిస్తున్నారు. కూతురు డాక్టరేట్ పొందడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎంపై కేటీఆర్ స్థాయి మరచి వ్యాఖ్యానించడం తగదు : ప్రకాష్‌గౌడ్

కొత్తపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ స్థాయి మరచి వ్యాఖ్యానించడం తగదని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా బీఆర్ఎస్ వాళ్లకు బుద్ధిరాలేదని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ త్వరలోనే పెట్టేబేడా సర్దుకుని అమెరికా వెళ్లడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రజలను ఇంకా ఎన్నాళ్లు రెచ్చగొడుతూ మోసం చేస్తారని ఆయన కేటీఆర్‌ను ప్రశ్నించారు. ప్రజాపాలన చేస్తున్న రేవంత్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం మానుకోండి అన్నారు. వెనుక ఉన్న భజన మండలి బ్యాచ్ చెప్పే మాటలు నమ్మకండి అని వాస్తవాలు తెలుసుకుంటే మంచిదని పేర్కొన్నారు.

మీర్‌పేట్ కాంగ్రెస్‌లో 'అవిశ్వాస' చీలికలు..!

- బీజేపీ వైపు చూస్తున్న పలువురు సభ్యులు
- కొందరు బీఆర్ఎస్ అసంతృప్త సభ్యులదీ అదే దారి
- ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల గైర్హాజర్‌తో వీగిన అవిశ్వాసం

సరూర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితులు కనిపిస్తోన్నాయి. ఇటీవల ఇక్కడి బీఆర్ఎస్ మేయర్‌పై కాంగ్రెస్, బీజేపీ సభ్యులతోపాటు బీఆర్ఎస్‌లోని పలువురు అసంతృప్త సభ్యులు కలిసి పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల గైర్హాజర్‌తో వీగిపోయిన విషయం విదితమే. అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉన్నప్పటికీ సదరు ఇద్దరు సభ్యుల వల్లనే వీగిపోయిందని, అలాంటప్పుడు తాము కాంగ్రెస్‌లో ఉంటూ బీఆర్ఎస్‌పై పోరాటం చేసి ఏం లాభమని సదరు ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులు మథనపడుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పాలని యోచిస్తున్నట్టు సమాచారం. వారితో పాటు బీఆర్ఎస్‌లోని పలువురు అసంతృప్త సభ్యులు సైతం పార్టీ మారాలనే ఆలోచనకు వచ్చినట్టు తెలుస్తోంది. మొత్తం మీద 12 నుంచి 15 మంది సభ్యులు తమ సొంత పార్టీలను వీడి మరో పార్టీలోకి వెళ్లే అవకాశాలున్నట్టు తెలిసింది. వారిని తమ పార్టీలోకి రమ్మంటూ బీజేపీ నేతలు మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం.

మేయర్ అభ్యర్థి కాంగ్రెస్‌లోకి వస్తానని చెప్పినా..

వాస్తవానికి మీర్‌పేట్ బీఆర్ఎస్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో ఆ స్థానం ఆశించిన బీజేపీ కార్పొరేటర్.. అవిశ్వాస క్రతువు ముగియగానే కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న కార్పొరేషన్ తమ ఖాతాలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు గైర్హాజరై ఆ అవకాశం చేజారి పోయేలా చేశారని.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి బీజేపీ సభ్యులతో కలిసి అవిశ్వాసం వైపు అడుగులు వేసిన కాంగ్రెస్ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఎంపీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు మైనస్

మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన ఎనిమిది మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెబితే ఎంపీ ఎన్నికల్లో పెద్ద మైనస్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గిన తర్వాత కాంగ్రెస్‌లోకి రావాలని నిర్ణయించుకున్న బీజేపీ అభ్యర్థితో పాటు బీజేపీకి చెందిన మరో ఇద్దరు ముగ్గురు సభ్యులు(వారు కూడా అప్పట్లో కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధపడ్డారు) సైతం ఇప్పుడు మనస్సు మార్చుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఎంపీ ఎన్నికల్లో మీర్‌పేట్‌లో కాంగ్రెస్‌కు ఎదురుగాలి తప్పదని తెలుస్తోంది. అవిశ్వాస అంకం వల్ల తలెత్తిన చీలికలు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారాయని విశ్లేషకులు అంటున్నారు.

దీని వెనుక కాంగ్రెస్‌కు చెందిన ఓ బడా నేత ఉన్నారని, ఆయన వల్లనే మేయర్ అవకాశం దూరమైందని ఆరోపిస్తున్నారు. తాము బీఆర్ఎస్‌ను వదిలిపెట్టి కాంగ్రెస్‌ను నమ్ముకుని పార్టీలో చేరినా, తాము ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు మద్దతు ఇవ్వకపోవడం పార్టీకి ద్రోహం చేసినట్టేనని అంటున్నారు. తమ వెంట 14 మంది బీజేపీ సభ్యులు, మరో పది మంది బీఆర్ఎస్ సభ్యులు మద్దతుగా నిలవగా.. సొంత పార్టీకి చెందిన సభ్యులే 'చేయి'వ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో తాము పార్టీలో ఉన్నా, లేకున్నా ఒకటేనని, ఆ ఇద్దరి వల్లనే కాంగ్రెస్ బలంగా ఉంటుందనుకుంటే తామేం చేయలేమని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అన్నీ కుంభకోణాలే..
మోదీ పాలనలో ఒక్క అవినీతి లేదు

- నన్ను గెలిపిస్తే ప్రభుత్వ హామీల అమలు కోసం కొట్లాడుతా
- కార్యకర్తల సమావేశంలో బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్

మన్సూరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు భారత్‌ను థర్డ్ క్లాస్ దేశంగా ప్రపంచ దేశాలు చూసేవని, కానీ మోదీ పదేళ్ల పాలనలో ఆపద వస్తే పేద దేశాలను ఆదుకునేలా ప్రపంచంలో బలమైన ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం రాత్రి నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో 2జీ స్కాం, బొగ్గు గనుల స్కాం లాంటి లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని, కానీ పదేళ్ల మోదీ పాలనలో ఒక్క కుంభకోణం లేదని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌కు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నాయన్నారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్మూకాశ్మీర్.. స్విట్జర్‌లాండ్‌లా అభివృద్ధి చెందుతుందన్నారు. లెఫ్టిస్టులు, రైటిస్టులు అందరూ తనకు ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ప్రజల కోసం నిలబడి పని చేయటమే తన లక్ష్యమన్నారు. తనను గెలపిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం కొట్లాడుతానని, ఢిల్లీ నుంచి రాష్ట్రానికి రావాల్సిన అభివృద్ధి పనులను తీసుకువస్తానని ఈటల పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, పార్లమెంట్ ఇన్‌చార్జి గోలి మధుసూదన్, నాయకులు కర్నాకర్, ఆర్.కె.శ్రీనివాస్, కొత్త రవీందర్‌గౌడ్, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, రంగా నర్సింహగుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఇంకుడుగుంతలపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 22 నుంచి 28వ తేదీ వరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట్ నుంచి కుంట్లూర్ రోడ్డులోని నారాయణ ఐఏఎస్ అకాడమీ కళాశాలలో ఇంకుడు గుంతలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేస్తే భావితరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తన సామాజిక బాధ్యతగా వర్షపు నీటిని వడిసిపట్టాలని సూచించారు. అందుకోసం ఇంకుడు గుంతలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఇంకుడు గుంతను నిర్మించారు. నీటి వృథాను అరికట్టడం నా కర్తవ్యాన్ని తప్పక నిర్వహిస్తానని, నీటి పొదుపులో భాగస్వామిని అవుతానని, బావితరాలకు నీటి సంరక్షణ కోసం కృషి చేస్తానని విద్యార్థులతో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి జల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. బి కృష్ణయ్య, డాక్టర్, ప్రేమ్‌కుమార్, శివారెడ్డి, ప్రణీత్‌రెడ్డి, చైతన్యరెడ్డి, భార్గవ్, సతీష్, సాయి, రఘురాం పాల్గొన్నారు.


జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రసన్నాంజనేయస్వామికి శతఘటాభిషేకం నిర్వహించారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు స్వర్ణ కిరీటధారణ చేశారు. అనంతరం సీతారామచంద్రస్వామి మూలమంత్ర సహిత మన్యుసూక్త హోమం నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య అనంత శ్రీవిభూషిత విద్యా శంకర భారతి మహాస్వామి కుంభాభిషేకం నిర్వహించారు.

అనంతరం భక్తులనుద్దేశించి శ్రీవిద్యాశంకర భారతి మహాస్వామి అనుగ్రహభాషణం చేశారు. సాయంత్రం సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. రాత్రి ఆర్‌కేపురం వీధుల్లో కనుల పండువగా రథోత్సవం సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు. కార్యక్రమంలో జగిని రమేష్, రాజుశ్రీవాత్సవ, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు శివ, మహేందర్, శేఖర్, దుర్గప్రసాద్, శ్రీధర్, బాలరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీవిభూషిత విద్యా శంకర భారతి మహాస్వామి

ఆస్తిపన్ను ఓటీఎస్ రాయితీ గడువు 3 రోజులే

- 31తో ముగుస్తున్న 90శాతం రాయితీ
- మలక్‌పేట సర్కిల్‌లో రూ.13.90కోట్లు వసూలు

ఓల్డ్ మలక్‌పేట మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూలుకు రాష్ట్రప్రభుత్వం వన్‌టైం సెటిల్ మెం ట్ స్కీం(ఓటీఎస్) ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే ఈనెల 31తో ఓటీఎస్ స్కీం రాయితీ గడువు ముగుస్తుంది.

ఇంకా మూడు రోజులు మాత్రమే ఉంది. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిలను రాబట్టుకునేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి 29 నుంచి మార్చి 31 వరకు ఆస్తిపన్ను ఇంట్రెస్ట్‌పై 90శాతం రాయితీ ప్రకటించింది. ఓటీఎస్ కింద మొత్తం బకాయిలు చెల్లించిన వారికే ఈరాయితీ వర్తిస్తుంది. మొండి బకాయిలు రాబట్టేందుకు మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆస్తిపన్ను వసూలు చేశారు. మరోవైపు సిబ్బంది ఇంటింటికీ తిరిగి రాయితీ గురించి ప్రజలకు వివరించి మొండి బకాయిలను కొంత మేర రాబట్టారు.

రూ.13కోట్ల 90లక్షలు వసూలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం కింద మలక్‌పేట సర్కిల్6లో రూ.13కోట్ల 90 లక్షల ఆస్తిపన్ను వసూలు అయ్యింది రాయితీకి ఇంకా మూడు రోజుల సమయం ఉండడంతో ఇంకా కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మలక్‌పేట సర్కిల్‌లో సంవత్సరానికి రావాల్సిన ఆస్తిపన్ను టార్గెట్ రూ. 38కోట్ల18లక్షలు కాగా ఇప్పటి వరకు మొత్తం రూ. 27కోట్ల58 లక్షలు వసూలు అయ్యింది. ఇంకా రూ.10 కోట్ల 60 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇక మూడు రోజుల్లో ఈ వార్షిక సంవత్సరం ముగుస్తుంది. ఆస్తిపన్ను వసూలు టార్గెట్ చేరుకోలేదు. మలక్‌పేట సర్కిల్6 కార్యాలయం.

ఏళ్ల కొద్దీ మొండి బకాయిలు

మలక్‌పేట సర్కిల్6 పరిధిలో పెద్దఎత్తున మొండి బకాయిలు పేరుకుపోయాయి. ఏళ్ల కొద్దీ ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్నారు. అధికారుల రికార్డు ప్రకారం ఓ విద్యాసంస్థ రూ.మూడుకోట్లు ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంది. మరో ఆస్పత్రి రూ.24లక్షలు, మరో కమర్షియల్ కాంప్లెక్స్ రూ.20లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇంకా చాలా కమర్షియల్ కాంప్లెక్స్‌లు కొన్ని సంవత్సరాలుగా ఆస్తిపన్ను చెల్లించడంలేదు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో 7వార్డులున్నాయి. సైదాబాద్, మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, అజంపుర, చావుని, డబీర్‌పుర, కమర్షియల్ 6,925, రెసిడెన్షియల్ 49,245, కమర్షియల్, రెసిడెన్షియల్ రెండు కలసి 496 ఉన్నాయి. మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో అన్ని కలిపి మొత్తం 56,665 నివాసాలున్నాయి.

ఆస్తిపన్ను చెల్లించాలి



ప్రజలు ఆస్తి పన్ను విధిగా చెల్లించాలి. వడ్డీపై రాయితీ ఇంకా మూడు రోజులే సమయం ఉంది. పెండింగ్ బకాయిలకు మంచి అవకాశం ప్రభుత్వం ఇచ్చిన ఓటీఎస్ స్కీం సద్వినియోగం చేసుకొని పెండింగ్ బకాయిలు క్లియర్ చేసుకోవాలి. ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిలకు చట్టప్రకారం చర్యలుంటాయి.

- జయంత్, ఉపకమిషనర్, మలక్‌పేట్ సర్కిల్

కూలకముందే మేలుకోండి

- మాదన్నపేట మండీలో ప్రమాదకరంగా షెడ్డు
- ప్రేక్షకపాత్రలో మార్కెటింగ్ శాఖ అధికారులు

సైదాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది రైతులు, వ్యాపారులు, వినియోగదారులు వచ్చే మాదన్నపేట కూరగాయాల మార్కెట్‌లో షెడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలతుందోనని బిక్కుబిక్కుమంటూ భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా మారిన షెడ్డులోనే రైతులు, వ్యాపారులు గత్యంతరం లేక ఆకుకూరలు అమ్మకాలు సాగిస్తున్నారు. ఓ వైపు ఒరిగిన రేకుల షెడ్డు ఎప్పుడూ కూలుతుందోనని భయంతో అమ్మకాలు సాగిస్తున్నామని మహిళలు రైతులు తెలిపారు. పలుమార్లు షెడ్డు పరిస్థితిపై మార్కెటింగ్ శాఖ అధికారులు, గత పాలకవర్గం సభ్యుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులు, పాలకవర్గం బాధ్యత వహించాలని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్‌లో ఇష్టారాజ్యం..

మాదన్నపేట మార్కెట్‌పై అధికారుల నియంత్రణ పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారే ఇష్టారాజ్యంగా మారింది. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం మలక్‌పేటగంజ్, మాదన్నపేట మండీల కోసం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియమిస్తుంది. కానీ కేవలం మలక్‌పేటగంజ్ పాలకవర్గాన్ని, అధికారులకు కల్పతరువుగా వాడుకున్నారే తప్ప, ఏ నేత మాదన్నపేట మండీని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు ఉన్నాయి. మాదన్నపేట మార్కెట్‌లో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తం, అక్రమ వసూళ్లు, నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళలలో జరుగుతున్న ఆకుకూరల దందా, ఇతర వ్యవహారాలపై స్వయంగా రైతులు, వ్యాపారులు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చినా స్పందించిన పాపానా పోలేదు.

ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, మాదన్నపేట మార్కెట్‌లోజరుగుతున్న అక్రమాలను అరికట్టాలని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.



ప్రమాదకర షెడ్డులోనే అమ్మకాలు


శిథిలావస్థలో రేకుల షెడ్డు

ఇంటర్ కాలేజీ అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేట్ ఇంటర్ కాలేజీలు చేస్తున్న అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన విద్యా సంవత్సరానికి మరో రెండున్నర నెలల సమయం ఉన్నప్పటికీ, పేరొందిన కొన్ని విద్యాసంస్థలు ఇప్పటికే 90శాతానికి పైగా అడ్మిషన్లు పూర్తి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటర్ బోర్డు నియంత్రణ అధికారుల చేతుల్లో లేదన్న ఆమె, రెండు కార్పొరేటు విద్యాసంస్థల చేతుల్లో వారు కీలుబొమ్మలాగా మారి వంతపాడుతున్నారని ఆరోపించారు. ఒకే బ్రాంచ్‌పై వందలాది కళాశాలలు పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా చేపట్టిన అడ్మిషన్లను రద్దు చేసి, ఇంటర్ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది ఆన్‌లైన్ ప్రక్రియద్వారా అడ్మిషన్లు చేపట్టి, ప్రతిభ కలిగిన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఝాన్సీ కోరారు.



నృత్యాలతో సందడి చేస్తున్న విద్యార్థులు

ఓయూలో ముగిసిన జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

తార్నాక, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ గురువారం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ముగిసింది. షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. అంతకు ముందు సినీ ప్రముఖుల చేత నిర్వహించిన వర్క్‌షాప్ ప్యానల్ డిస్కషన్ ద్వారా సినీ ఔత్సాహికులకు ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన షార్ట్‌ఫిల్మ్‌లకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు.

ఎండిన ఆకులతో సాయిల్ కండిషనర్

- మాపిల్ టౌన్ విల్లాస్‌లో తయారీ
- పరిశీలించిన కమిషనర్


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని మ్యాపిల్‌టౌన్ విల్లాస్‌లో అధునాతన విధానంలో సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టారు. యాక్సిలరేటెడ్ ఎనరోబిక్ కంపోస్టింగ్ విధానంలో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటుచేసి ఎండిన ఆకులను అధిక పోషకాలు గల సాయిల్ కండిషనర్ (ఆర్గానిక్ ఎరువు)గా తయారుచేస్తున్నారు. ఇందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) హైదరాబాద్, సీఎస్ఐఆర్ సాంకేతిక సహకారమందిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీలోని చెట్ల నుంచి రాలిన ఆకులను ప్లాంట్ ద్వారా ఎరువుగా మారుస్తున్నారు. నెలకు సుమారు 10 టన్నుల సాయిల్ కండిషనర్ తయారు చేస్తున్నారు. ఈ ఎరువుకు మార్కెట్‌లోనూ భారీగా డిమాండ్ ఉంది. ప్లాంట్‌ను గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ పరిశీలించారు. అదే గేటెడ్ కమూనిటీలో ఉన్న సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌నూ సందర్శించారు. మాపిల్‌టౌన్ యజమానులు, సీఎస్ఐఆర్, ఐఐసీటీ కృషిని కమిషనర్ అభినందించారు. ఇతర గేటెడ్ కమ్యూనిటీలూ ఈ తరహా ఏర్పాట్లకు ముందుకు రావాలని కోరారు.